


# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

మంగళవారం,
ఏప్రిల్ 29, 2025

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-

# కేసీఆర్ వల్లే అన్ని అనర్థాలు

## ఇప్పటివరకు ప్లానింగ్‌కే సరిపోయింది.. సెట్ చేయడానికే ఏడాది: సీఎం రేవంత్

- మీడియాతో ఇష్టాగోష్టిలో సీఎం రేవంత్
- రాష్ట్ర ఖజానా అంతా కేసీఆరే లూటీ చేశారు
- నేను సీఎం అయినప్పుడే ఆయన గుండె పగిలింది
- ఎల్కతుర్తి సభలో తన అక్కసు అంతా వెళ్లగక్కాడు
- రాష్ట్రంలో ఉన్న పథకాలు దేశంలో ఎక్కడా లేవు
- లాంచింగ్, క్లోజింగ్ పథకాలు
- నాతో కాదు.. షోపుటప్ స్కీంలు పెట్టను
- రాష్ట్ర ప్రజలు మాకు కూడా పదేళ్లు అవకాశం ఇస్తారు
- ఇంకా ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటానన్న సీఎం



హైదరాబాద్: రాష్ట్రంలో జరుగుతున్న అన్ని అనర్థాలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆరే కారణమని, రాష్ట్ర ఖజానా అంతా లూటీ చేసింది ఆయనేనని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. పార్టీ రజతోత్సవం పేరుతో ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ సభలో ఆయనలో ఉన్న అక్కసునంతా వెళ్లగక్కాడని విమర్శించారు. వాస్తవానికి తాను ముఖ్యమంత్రిని అయిన రోజునే కేసీఆర్ గుండె పగిలిందని వ్యాఖ్యానించారు. తాము అధికారంలోకి వచ్చాక.. అంతకుముందు పదేళ్లలో కేసీఆర్ చేసిన విధ్వంసాన్ని సెట్ చేయడానికే ఏడాది కాలం సరిపోయిందని, ఇప్పుడంతా స్ట్రీమ్‌లైన్ (క్రమబద్ధీకరణ) చేస్తున్నామని చెప్పారు. సోమవారం కాంగ్రెస్ సీనియర్ నేత కె.జానారెడ్డి నివాసంలో రేవంత్‌రెడ్డి మీడియాతో ముచ్చటించారు. బీఆర్ఎస్ సభ, మావోయిస్టుల సమస్య, కేసీఆర్ పాలన, తన పనితీరు, రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, రాహుల్‌గాంధీతో తనకున్న మైత్రి తదితర అంశాలపై మాట్లాడారు.

### ఎవరో అడుగుతున్నారని అరెస్టులు ఉండవు

'కేసీఆర్ ప్రసంగంలో పస లేదు. బీఆర్ఎస్ ఎల్కతుర్తి సభ కంటే నేను గజ్వేల్‌లో పెట్టిన సభే హైలైట్. ఖమ్మంలో జరిగిన రాహుల్‌గాంధీ సభకు బీఆర్ఎస్ హయాంలో కనీసం బస్సులు కూడా ఇవ్వలేదు. కానీ మేం బీఆర్ఎస్ నేతలు అడిగినన్ని బస్సులు ఇచ్చాం. తద్వారా ఆర్టీసీకి ఆదాయం కూడా వచ్చింది. హరీశ్, కేటీఆర్‌లు చిన్నపిల్లలని నేను అసెంబ్లీలో మాట్లాడిన విషయాన్నే కేసీఆర్ ఎల్కతుర్తి సభలో చెప్పాడు. మరి పిల్లగాళ్లను అసెంబ్లీకి ఎందుకు పంపిస్తున్నాడు? కేసీఆర్, మోదీ వారి అవసరాలకు అనుగుణంగా మాట్లాడుతుంటారు. కేసీఆర్ తరహాలో నేను చట్టాన్ని అతిక్రమించి పనిచేయను. ఎవరో అడుగుతున్నా రని అరెస్టులు చేసే పరిస్థితి ఉండదు. కక్ష సాధింపు చర్యలకు పాల్పడేది లేదు. చట్టప్రకారమే అన్నీ జరుగుతాయి..' ముఖ్యమంత్రి అన్నారు.

### ఏ పథకమైనా అర్హులందరికీ లబ్ధి చేకూరాలి

'కేసీఆర్ తరహాలో లాంచింగ్, క్లోజింగ్ పథకాలు నేను పెట్టలేను. షోపుటప్ స్కీంలు నాతో కాదు. ఒక పథకాన్ని ప్రారంభిస్తే అర్హులందరికీ లబ్ధి కలిగేంతవరకు పనిచేస్తా. రేవంత్‌రెడ్డి చెప్పిందే చేస్తాడనే నమ్మకం ప్రజల్లో కలిగేలా పనిచేస్తా. ఇప్పటివరకు ప్లానింగ్‌కే సమయం సరిపోయింది. ఇక నుంచి స్పీడప్ చేయాల్సిన అవసరం ఉంది. పథకాల గ్రౌండింగ్ చేస్తాం. అయితే ఇప్పటివరకు చేసిన కార్యక్రమాలను చెప్పుకోవడంలో కూడా మేము వెనుకబడ్డాం.

### ఏడాదిన్నరలోనే ఎన్నో పథకాలు

అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే ఎన్నో పథకాలు తీసుకువచ్చాం. ఇప్పుడు వాటన్నింటినీ స్ట్రీమ్‌లైన్ చేస్తున్నాం. మేము అమలు చేస్తున్న పథకాలు దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేవు. బీఆర్ఎస్ తరహాలో మాకు కూడా తెలంగాణ ప్రజలు

(మిగతా 2వ పేజీలో)



## ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి పద్మవిభూషణ్, బాలకృష్ణకు పద్మభూషణ్, నాగఫణిశర్మ, మిరియాల అప్పారావుకు పద్మశ్రీ పురస్కారాలు ప్రదానం చేసిన రాష్ట్రపతి ముర్ము



## మోదీతో రాజ్‌నాథ్ భేటీ.. భారత సైన్యం, సరిహద్దు భద్రతపై చర్చ!

# వైటిపిఎస్‌లో అగ్నిప్రమాదం

- ట్రయల్ రన్ సమయంలో
- యూనిట్-1బాయిలర్ వద్ద ఆయిల్ లీకేజ
- ప్రమాద స్థలానికి చేరుకుని పరిశీలించిన ఎమ్మెల్యే బిఎల్ఆర్
- పాక్షిక నష్టం, సిబ్బంది క్షేమం







మిర్యాలగూడ, ఏప్రిల్ 28 :- (వార్త మిర్రర్) : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెం వద్ద నిర్మిస్తున్న యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులోని యూనిట్ -1లో సోమవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. బాయిలర్ నుండి ఆయిల్ లీకేజీ అయ్యి మంటలు చెలరేగటంతో యూనిట్ వన్ పాక్షికంగా దెబ్బతిన్నది. వచ్చే నెలలో యూనిట్ వన్ ను ప్రారంభించి గ్రిడ్ కు అనుసంధానం చేయ నుండగా అందుకుగాను అధికారులు ముందస్తు ట్రయల్ రన్ నిర్వహిస్తు న్నారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ ప్రక్రియలో సోమవారం తెల్లవారుజామున బాయిలర్ గ్యాస్ కిట్ వద్ద వత్తిడి ఎక్కువయ్యి ఆయిల్ లీక్ కావటంతో ప్రమాదవశాత్తు మంటలు అంటుకొని అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. దీంతో ఒక్కసారిగా అగ్నికీలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి. ప్రమాదాన్ని గుర్తించిన అధికారులు సిబ్బంది ని అప్రమత్తం చేశారు. వెంటనే ఫైర్ ఇంజన్లు పిలిపించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇతర విభాగాలలో ఉన్న సిబ్బంది కూడా సహకారం అందించడంతో పెద్దగా ఆస్తి నష్టం,ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండానే మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ట్రయల్ రన్ చేసే సమయంలో ఇలాంటి ప్రమాదాలు సహజమే అని అధికార వర్గాలు వెల్లడిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం, పెద్ద ఎత్తున ఆస్తి నష్టం జరగకపో వడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. జరిగిన ప్రమాదం ద్వారా లోపాలను గుర్తించి, వాటిని వీలైనంత తొందరలో సరిచేసి తిరిగి ట్రయల్ రన్ నిర్వహించ నున్నట్లు అధికార వర్గాల ద్వారా తెలిసింది. స్టేషన్ లో అగ్గిప్రమాద ఘటనపై వెంటనే స్పందించిన స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ( బి ఎల్ అర్ ) హుటాహుటిన ప్లాంటును పరిశీలించి ప్రమాదం జరిగిన తీరుపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అధికారులు ఆయనకు ప్రమాదం జరిగిన తీరును వివరించారు. ప్లాంట్ లో మొత్తం ఐదు బాయిలర్ ఉండగా వాటిలో మూడు బాయిలర్లు రన్ చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. బాయిలర్ వన్ వద్ద ఈ స్వల్ప ఘటన మినహా మిగిలిన యూనిట్లలో ఎలాంటి ఇబ్బంది లేదని అధికారులు ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడుతూ త్వరితగతిన ప్రమాదానికి గురైన బాయిలర్ గ్యాస్ కట్టు రిపేరు చేయాలని, ప్రమాదంలో ధ్వంసమైన సామాగ్రిని తిరిగి ఏర్పాటు చేయాలని ప్లాంట్ అధికారులను ఎమ్మెల్యే కోరారు. దానికి స్పందిస్తూ మరమ్మత్తులు పూర్తిచేసి 24 గంటల్లోపు రన్నింగ్ లోకి తీసుకొస్తామని అధికారులు వెల్లడించారు. జరిగింది చిన్న ప్రమాదమని, ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే బిఎల్ఆర్ తెలిపారు.



## బీజాపూర్‌లో 24 మంది నక్సలైట్ల లొంగుబాటు

వార్త మిర్రర్
తెలుగు దినపత్రిక

విలేకరులుగా పనిచేయాలనుకుంటున్న వారికి
ఇదే మా ఆహ్వానం

హైదరాబాద్ కేంద్రంగా వెలువడుతున్న వార్తా మిర్రర్ తెలుగు డిజిటల్ దినపత్రికలో జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాలవారిగా పనిచేయాలని ఆసక్తి ఉన్న విలేకరులకు ఇదే మా ఆహ్వానం

గణేష్ సాగర్
నెట్ వర్క్ ఇంచార్జ్
Cell : 919908710655

# కేసీఆర్ వల్లే అన్ని అనర్థాలు



పదేళ్లు అవకాశం ఇస్తారు. వాస్తవానికి నా పాలన, పథకాల అమలుపై ఎన్నికలకు ఆరు నెలల ముందు నుంచే చర్చ జరుగుతోంది..' అని రేవంత్ చెప్పారు.

**రాహుల్‌తో మంచి సంబంధాలున్నాయి**

'రాహుల్‌గాంధీతో నా స్నేహం గురించి నాకు తెలిస్తే చాలు. ఎవరో ఏదో చెబితే వినాల్సిన పనిలేదు. ఆయనతో నాకు మంచి సంబంధాలున్నాయి. మా ఇద్దరి గురించి బయటి వారు ఏం మాట్లాడుకుంటున్నారనేది నాకు అవసరం లేదు. ప్రపంచంలో ఇందిరాగాంధీకి మించిన రాజకీయ యోధురాలు లేరు. ఒక దేశాన్ని ఓడించిన చరిత్ర ఆమెది.

**వేరే ఆప్షన్ లేకే ఆ అధికారుల కొనసాగింపు**

పాలన అవసరాలను బట్టి అధికారులను వినియోగించుకుంటాం. కొందరు అధికారుల గురించి అన్ని విషయాలు తెలిసినా వేరే ఆప్షన్ లేకపోవడంతో కొనసాగించాల్సి వస్తోంది. కలెక్టర్లను మార్చుకునే వెసులుబాటు ఉంది కనుకనే మారుస్తున్నాం.

**సీపీఐ, ఎంఐఎంకు అండగా ఉన్నా..**

నేను ఇంకా ఇరవై ఏళ్లు రాజకీయాల్లో ఉంటా. నన్ను నమ్ముకున్న వారిని ఎప్పుడూ మర్చిపోను. నన్ను నమ్మిన సీపీఐకి, ఎంఐఎంకు అండగా ఉన్నా. అద్దంకి దయాకర్‌కు పదవి ఇప్పించగలిగా. దయాకర్ ఓపికతో ఉన్న కారణంగానే పదవి వచ్చింది. ఓపికతో ఉంటేనే నాకు కూడా బాధ్యత ఉంటుంది. అవకాశాలు వస్తాయి. అలా కాదని బయటకు వచ్చి స్లీపింగ్ రిమార్కులు చేస్తే నాపై భారం తగ్గించినట్టే అవుతుంది. పదవి ఇవ్వలేని పరిస్థితికి, వారి మాటలకు చెల్లుకు చెల్లు అయినట్టు నేను ఫీల్ అవుతా..' అని ముఖ్యమంత్రి అన్నారు.

**ఎంత చెప్పినా కొందరు ఎమ్మెల్యేలు వినడం లేదు**

'కొందరు ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో సరిగా పనులు చేసుకోలేకపోతున్నారు. ఎన్నిసార్లు చెప్పినా వారు హైదరాబాద్ వదిలి వెళ్లలేకపోతున్నారు. మీడియా చుట్టూ తిరిగేందుకే పరిమితం అవుతున్నారు..' అని సీఎం వ్యాఖ్యానించారు.

**మావోయిస్టులపై పార్టీ నిర్ణయమే ఫైనల్**

'ఆపరేషన్ కగార్‌పై జాతీయ స్థాయిలో చర్చ జరగాలి. మావోయిస్టుల విషయంలో పార్టీ నిర్ణయమే ఫైనల్. కాంగ్రెస్ అధిష్టానం నిర్ణయం తీసుకున్న తర్వాత ప్రభుత్వ విధానాన్ని ప్రకటిస్తాం..' అని రేవంత్ తెలిపారు.

**జానా నివాసంలో 'కగార్'పై చర్చలు**

లోకాయుక్త, ఉప లోకాయుక్త పదవీ స్వీకార కార్యక్రమానికి సోమవారం రాజ్‌భవన్‌కు వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి.. అక్కడి నుంచి నేరుగా మాజీ మంత్రి కె.జానారెడ్డి నివాసానికి వెళ్లారు. అక్కడ జానారెడ్డితో పాటు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, వేం నరేందర్‌రెడ్డిలతో సమావేశమయ్యారు. ఆపరేషన్ కగార్ గురించి చర్చించారు. మావోయిస్టుల సమస్యకు సంబంధించి శాంతి చర్చల కమిటీ ఆదివారం తనతో సమావేశం కావడాన్ని, తాను చొరవ తీసుకుని కేంద్రాన్ని శాంతి చర్చలకు ఒప్పించేలా చూడాలని వారు కోరిన విషయాన్ని తెలియజేశారు. గతంలో మావోయిస్టులతో చర్చలు జరిగినప్పుడు జానారెడ్డి హోంమంత్రిగా, కేశవరావు పీసీసీ అధ్యక్షుడిగా ఉన్న నేపథ్యంలో.. శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనలపై ఏం చేయాలన్న దానిపై వారితో చర్చించారు. అక్కడి నుంచే ఏఐసీసీ సీనియర్ నేతలు దిగ్విజయ్‌సింగ్, చిదంబరంలతో సీఎం మాట్లాడారని సమాచారం. కాగా శాంతి చర్చల కమిటీ ప్రతిపాదనను పార్టీ అధిష్టానానికి పంపాలని సమావేశంలో నిర్ణయించారు.

# అధికారం కోల్పోయినా అహంకారం తగ్గలే:మంత్రి పొంగులేటి

అధికారం కోల్పోయినా కెసిఆర్‌కు ఇంకా అహంకారం తగ్గలేదని, కడుపు నిండా విషం నింపుకొని..మంచి చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై విషం చిమ్ముతున్నారని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి నిప్పులు చెరిగారు. భూ భారతి కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా, వర్గల్ మండలం, శాకారం టిజిఆర్ గార్డెన్స్‌లో సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయనతోపాటు మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రాన్ని ప్రకటించిన దేవత సోనియా గాంధీకి సాష్టాంగ ప్రణామం చేసిన కెసిఆర్.. కాలం తిరగబడి ప్రజలు బుద్ధి చెప్పడంతో కాంగ్రెస్‌ను విలన్‌గా చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ఖజానాను నిండా ముంచిన కెసిఆర్ కనీసం గ్రామస్థాయి సర్పంచులకు కూడా బిల్లు ఇవ్వకపోగా, తప్పును తమపై నెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నియంతలా వ్యవహరించిన కెసిఆర్ సొంత పార్టీ ఎంఎల్‌ఎలను కూడా కలిసేందుకు ఒప్పుకోలేదని వ్యాఖ్యానించారు. ఇపుడు తగుదునమ్మా అంటూ రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని అన్నారు. రైతులు ఆత్మగౌరవంతో బ్రతికేందుకే తాము భూ భారతి చట్టం తీసుకువచ్చామని, తమ అక్రమాలు బయటపడతాయనే బిఆర్‌ఎస్ నేతలు గగ్గోలు పెడుతున్నారని వ్యాఖ్యానించారు. తాము రైతులకురూ.2 లక్షల రుణమాఫీ చేసినందుకా, మహిళలు ఉచిత ప్రయాణం చేస్తున్నందుకా, రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందజేస్తున్నందుకా, పేదలకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకా, మీ ఏడుపులు, పెడబొబ్బలు అంటూ కెసిఆర్ ను ప్రశ్నించారు. రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకోగా, గజ్వేల్ నియోజకవర్గానికి 3,500 ఇండ్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మనూ చౌదరి, అడిషనల్ కలెక్టర్ గరీమ అగర్వాల్, ఎంఎల్‌ఎ నాయిని రాజేందర్ రెడ్డి, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తూ%శీ%కుంట నర్సారెడ్డి, డిసిసిబి ఛైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి, నాయకుడు భూమ్ రెడ్డి ఎలక్షన్ రెడ్డి, గజ్వేల్, వంటిమామిడి, కొండపాక మార్కెట్ కమిటీ ఛైర్మన్లు నరేందర్ రెడ్డి, విజయ మోహన్, శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌డిఓ చంద్రకళ, తహసిల్దార్ బాలరాజు తదితరులు పాల్గొన్నారు.



# మరిన్ని పోరాటలకు సిద్ధం

**బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్**

హైదరాబాద్ : భారత రాష్ట్ర సమితి రజతోత్సవ సందర్భంగా వరంగల్‌లో జరిగిన బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన తెలంగాణ ప్రజలకు, సభను విజయవంతం చేయడంలో కీలకపాత్ర వహించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఈ సభను లక్షల సంఖ్యలో ప్రజలు సభకు హాజరై, కెసిఆర్ నాయకత్వం పట్ల అచంచలమైన విశ్వాసాన్ని ప్రకటించారని కొనియాడారు. ఆదివారం సభ ద్వారా భారత రాష్ట్ర సమితి మరోసారి అధికారంలోకి రాబోతోందని స్పష్టమైందని అభిప్రాయపడ్డారు. దేశ రాజకీయ చరిత్రలో అతిపెద్ద బహిరంగ సభల్లో ఒకటిగా ఈ రజతోత్సవ సభ నిలిచిపోతుందని వ్యాఖ్యానించారు. బిఆర్‌ఎస్ ప్రజా బలాన్ని ఈ సభ మరోసారి నిరూపించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో రాష్ట్ర పోలీసు యంత్రాంగం విఫలమైనప్పటికీ, లక్షలాది మంది ప్రజలు ముందే సభ ప్రాంగణానికి చేరుకోవడం తెలంగాణ ప్రజల నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. భారీ ట్రాఫిక్ సమస్యలు ఉన్నప్పటికీ, సభ విజయవంతంగా పూర్తి కావడం గర్వకారణమని తెలిపారు. ఆదివారం జరిగిన ఈ సమావేశం రజతోత్సవ సమావేశాల కార్యక్రమాలకు కేవలం ప్రారంభం మాత్రమేనని అన్నారు. కెసిఆర్ స్వయంగా తానే ముందుండి పోరాడతాను అని ప్రకటించడంతో, భవిష్యత్తులో మరిన్ని ప్రజా పోరాటాలకు సిద్ధం కావాలని కెటిఆర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే తగిన సమయం ఇచ్చామని, ఇకపై ప్రతి అంశంపై ప్రభుత్వాన్ని వెంటాడుతామని స్పష్టం చేశారు. ప్రజలను చైతన్యపరిచేందుకు, ప్రభుత్వ వైఫల్యాలను, దోపిడీ చర్యలను మీడియా ద్వారా ఎండగట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసే అరాచకాలను, వారి ప్రచారాలను ఎక్కడికక్కడ ఎదుర్కొని ప్రజల్లో స్పష్టత తీసుకురావాలని, మరింత చురుకుగా ముందుకు సాగాలని తెలిపారు.

**పార్టీ శ్రేణులతో కెటిఆర్ టెలి కాన్ఫరెన్స్**

బిఆర్‌ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులతో పాటు పార్టీ శ్రేణితో వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున స్పందించి సభ విజయవంతం కావడంలో మద్దతు తెలిపిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రత్యేక కృషి చేసిన వరంగల్ జిల్లా పార్టీ ప్రజా ప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలతో పాటు హుస్నాబాద్ మాజీ ఎంఎల్‌ఎ, పార్టీ కార్యకర్తలకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభా ప్రాంగణం వద్ద గత నెల రోజులుగా నాయకులు, కార్యకర్తలు చేసిన కృషి ఫలితంగా ఈ సభ ఎంతో విజయవంతంగా జరిగిందని పేర్కొన్నారు. నాయకులందరి నిబద్ధత, కృషి వల్లనే ఇంత భారీ సభ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముగిసిందని ప్రశంసించారు. స్థానిక శాసనసభ నియోజకవర్గాల ఇంచార్జ్‌లు, జిల్లా అధ్యక్షుల సమన్వయంతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతి కార్యకర్త సురక్షితంగా తమ ఇండ్లకు చేరుకున్నారని, ఇందుకోసం శ్రమించిన ప్రతి నాయకునికి, కార్యకర్తకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. క్షేత్రస్థాయి నుంచి పార్టీ కేంద్ర కార్యాలయం వరకు ప్రతి ఒక్కరూ సభ విజయవంతం కావడానికే పని చేశారని కెటిఆర్ అభినందించారు. ఈ భారీ బహిరంగ సభను పక్కా ప్రణాళికతో, ఎలాంటి అవాంతరాలు లేకుండా విజయవంతం చేయగలిగామని పేర్కొన్నారు. సభ విజయవంతం కావడానికి కృషి చేసిన భారత రాష్ట్ర సమితి నాయకులకు, పార్టీ శ్రేణులకు, దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించిన సీనియర్ నాయకులకు, సోషల్ మీడియా వారియర్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. వీరందరి కృషితో ఈ చారిత్రాత్మక సభ మరువలేని ఘట్టంగా నిలిచిందని చెప్పారు. అదేవిధంగా, మంచి కవరేజ్‌తో సభా కార్యక్రమాలను ప్రజలకు అందించిన మీడియా మిత్రులకు కూడా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



# బీబీసీది పక్షపాత రిపోర్టింగ్




**విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆగ్రహం**

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడిపై బీబీసీ కవరేజ్ పట్ల కేంద్రం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బీబీసీది పక్షపాత రిపోర్టింగ్ అని విమర్శించింది. పాక్ జాతీ యుల వీసాల రద్దుపై బీబీసీ రాసిన కథనంలో ఉగ్ర దాడిని మిలిటెంట్ అటాక్‌గా పేర్కొనడంపై భారత ప్ర భుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఇది దేశం మనోభావాలను దెబ్బతీస్తుందని బీబీసీ ఇండియా హెడ్ జాకీ మార్టిన్‌కు విదేశాంగశాఖ లేఖ రాసింది. బీబీసీ రిపోర్టింగ్‌ను విదేశాంగ శాఖ పర్యవేక్షిస్తుందని లేఖలో పేర్కొంది. పహల్గాం ఉగ్రదాడి తర్వాత సరిహద్దు వెంబడి తప్పుడు సమాచారం, రెచ్చగొట్టే సందేశాలను నిరోధించడానికి 16 పాకిస్తాన్ యూట్యూబ్ చానళ్లను భారత్ నిషేధించింది. నిషేధానికి గురైన చానళ్లలో పాకిస్తాన్ మాజీ పేసర్ షోయబ్ అక్తర్ యూట్యూబ్ ఛానల్ ఉండటం గమనార్హం.

## ఘనంగా పద్మ అవార్డుల ప్రదానోత్సవం

న్యూఢిల్లీ: దేశంలోని పలు రంగాల్లో విశిష్ట సేవలు అందించిన పలువురు ప్రముఖులు సోమవారం న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో పద్మ పురస్కారాలు అందుకున్నారు. ఏపీ, తెలంగాణకు చెందిన నలుగురికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు ప్రదానం చేశారు. వైద్యరంగంలో ప్రముఖ వైద్యుడు డాక్టర్ దువ్వూరి నాగేశ్వర్‌రెడ్డి (పద్మవిభూషణ్), కళారంగంలో నందమూరి బాలకృష్ణ (పద్మభూషణ్), మాడుగుల నాగఫణిశర్మ (పద్మశ్రీ) పురస్కారాలు అందుకున్నారు. మిరియాల అప్పారావు (పద్మశ్రీ) తరఫున ఆయన కుమార్తె యడవల్లి శ్రీదేవి అవార్డు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఉప రాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌ఖడ్, ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు అమిత్ షా, జి.కిషన్‌రెడ్డి, రామ్మోహన్‌నాయుడు, శివరాజ్‌సింగ్ చౌహాన్, జితేంద్రసింగ్, ఏపీ మంత్రి లోకేశ్ దంపతులు, అవార్డు గ్రహీతల కుటుంబ సభ్యులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

**బాలకృష్ణకు సీఎం, డిప్యూటీ సీఎం అభినందనలు**

అమరావతి: సినీనటుడు, హిందూపురం ఎమ్మెల్యే బాలకృష్ణ సోమవారం పద్మభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ వేర్వేరుగా అభినందనలు తెలిపారు. 'కళ, సేవ, రాజకీయ రంగాల్లో తనదైన ముద్ర వేసుకున్న బాలయ్య మరిన్ని నూతన శిఖరాలు అధిరోహించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను..' అని సీఎం చంద్రబాబు 'ఎక్స్'లో పోస్టులో చేశారు. 'తెలుగు చలనచిత్ర పరిశ్రమలో బాలకృష్ణది ప్రత్యేక స్థానం. ఆయన ప్రజాసేవలో, కళాసేవలో మరిన్ని మైలురాళ్లు చేరుకోవాలని ఆకాంక్షిస్తున్నాను..' అని పవన్‌కళ్యాణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

## మోదీతో రాజ్‌నాథ్ భేటీ.. భారత సైన్యం, సరిహద్దు భద్రతపై చర్చ!

ఢిల్లీ: పహల్గాం దాడితో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ ప్రధాని మోదీతో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ భేటీ అయ్యారు. దాదాపు 45 నిమిషాల పాటు ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పహల్గాంలో పరిస్థితులతో పాటు భద్రతా సన్నద్ధతపై సైన్యం తీసుకున్న నిర్ణయాలను ఆయనకు వివరించారు. ఇక.. మోదీతో భేటీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోబాల్ కూడా పాల్గొన్నారు. మరోవైపు.. రక్షణ వ్యవహారాలపై పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ కూడా సోమవారం భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉండగా.. పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి ఘటనతో భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. పాక్ సీమాంతర ఉగ్రవాదాన్ని వీడేవరకూ ఆ దేశంపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించిన భారత్.. పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ఇప్పటికే పాక్ జాతీయులను వారి దేశానికి పంపించింది.

## దోచుకున్న డబ్బుతో కేసీఆర్ సభ

మంత్రి ఉత్తమ్ చెప్పారు. దేశంలో పేదలకు సన్న బియ్యం ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటేనన్నారు. అలాగే అర్హులకు రేషన్‌కార్డులు ఇవ్వడంలో బీఆర్ఎస్ విఫలమవగా తాము అర్హులందరికీ కార్డులకు శ్రీకారం చుట్టామని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా జలాలను ఆంధ్రాకు అప్పగించారని.. 512 టీఎంసీలు ఏపీ తీసుకుంటే, తెలంగాణకు 299 టీఎంసీలే వచ్చేలా ఒప్పందం చేసుకున్నారని ఉత్తమ్ విమర్శించారు. కానీ తామిప్పుడు 500 టీఎంసీలను తెలంగాణకు ఇవ్వాలని కొట్లాడుతున్నామని చెప్పారు. తమ పాలనలోనే ఎస్ఎల్‌బీసీ పనులు పూర్తి చేస్తామని చెప్పారు.

**నాడు సోనియా కాళ్లు మొక్కి.. నేడు కాంగ్రెస్ విలన్ అంటావా: కోమటిరెడ్డి**

తెలంగాణ ఇచ్చిన తల్లి అంటూ కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లి సోనియా గాంధీ కాళ్లు మొక్కిన కేసీఆర్ నేడు కాంగ్రెస్ పార్టీనే విలన్ అనడం ఎంత వరకు సమంజసమని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు. సోనియా వల్లే తెలంగాణ వచ్చిందని అసెంబ్లీ సాక్షిగా చెప్పి నేడు అదే నోటితో కాంగ్రెస్‌ను విమర్శించడం ప్రజలు గమనిస్తున్నారన్నారు. దళితుడిని సీఎం చేస్తాన ని చెప్పి కేసీఆర్ మాటమార్చి మోసం చేశారని దుయ్యబట్టారు. అవినీతి డబ్బుతో మీటింగ్ పెట్టి కాంగ్రెస్‌ను విమర్శిస్తే సహించేది లేదన్నారు.


**ఉత్తమ్, వెంకట్‌రెడ్డిలది సీఎం స్థాయి: రాజగోపాల్‌రెడ్డి**

కేసీఆర్‌కు దమ్ముంటే అసెంబ్లీకి రావాలని.. పదేళ్లు ఆయన ఏం చేశారో సమాధానం చెబుతామని మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా మంత్రులైన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీఎం స్థాయిలో ఉన్నవారన్నారు. కోమటిరెడ్డి పదవు ల కోసం పాకులాడలేదని.. తెలంగాణ కోసం పదవికి రాజీనామా చేశారని గుర్తుచేశారు.

## గ్రూప్1 పిటిషనర్లకు హైకోర్టు జరిమానా

హైదరాబాద్: తప్పుడు ప్రమాణ పత్రాలతో పిటిషన్ దాఖలు చేసి న గ్రూ ప్1 అభ్యర్థులకు హైకోర్టు రూ.20 వేల జరిమానా విధించింది. వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించిం ది. టిజిపిఎస్‌సి నిర్వహించిన గ్రూప్1 మూల్యాంకనంలో అవకతవకలు చోటు చే సుకున్నాయంటూ మొత్తం 19మంది పిటిషన్ దాఖలు చేశారు. మెమోకు, వెబ్‌సైట్‌లోని మార్కులకు తేడాలున్నాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. రీవాల్యుయేషన్ చేసి మార్కులు పారదర్శకంగా వెల్లడించాలని కోరారు. దీనిపై న్యాయమూర్తి జస్టిస్ నగేశ్ బీమపాక సోమవారం విచారణ చేపట్టా రు. పిటిషనర్లు తప్పుడు ప్రమాణ పత్రాలు దాఖలు చేశారని టిజిపిఎస్‌సి తరపు న్యా యవాది కోర్టుకు వెల్లడించారు. ప్రాథమిక వివరాలను పరిశీలించిన న్యాయస్థానం అ భ్యర్థులు తప్పుడు అఫిడవిట్ ఇచ్చారని పే ర్కొంది. వాస్తవాలను దాచి కోర్టును తప్పు దోవ పట్టించారని ఆగ్రహం వ్యక్తం చేసింది.

## 'కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులపై చర్చకు వస్తారా?'



హైదరాబాద్: తెలంగాణ విధ్వంసానికి మొదటి ముద్దాయి కేసీఆర్ అని బీజేఎప్పీ నేత మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ అబద్ధాలు చెప్పడంలో దిట్టని, తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలపై చర్చకు వస్తారా? అని మహేశ్వర్ రెడ్డి సవాల్ విసిరారు. ఎల్కతుర్తి సభలో సెటైర్లు వేశారు మహేశ్వర్ రెడ్డి. కొండంత రాగం తీసి.. దిక్కుమాలిని పాట పాడినట్లు ఉంది బీఆర్ఎస్ రజతోత్సవ సభ అని ఎద్దేవా చేశారు. 'తెలంగాణకు ఒక్క మెడికల్ కాలేజ్ ఇవ్వలేదని నిందించారు. బీబీ నగర్ లో ఎయిమ్స్ ఎవరిచ్చారు?, కేసీఆర్ పదేళ్లపాటు మావోయిస్టులను చర్చలకు ఎందుకు పిలవలేదు. అధికారం పోయాక మావోయిస్టులు గుర్తుకు వచ్చారా?, మావోయిస్టులను వెనకేసుకురావడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. గతంలో చర్చలు జరిపినప్పుడు ఏమైంది?, మావోయిస్టులకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం లేదు' అని ధ్వజమెత్తారు.

**కేసీఆర్ పగటి కలలు కంటున్నారు..**

మళ్లీ అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటి కలలు కంటున్నారని మహేశ్వర్ రెడ్డి విమర్శించారు. కేసీఆర్ ఆర్థిక విధ్వంసాన్ని ప్రజలు ఎప్పటికీ మర్చిపోరు. బీఆర్ఎస్ మోడల్ అంటే విధ్వంస పాలన.. ఫెయిల్యూర్ పాలన.. కుటుంబ పాలన. కుటుంబ పాలనకు కాలం చెల్లింది. తెలంగాణకు అప్పుల ఊబిలోకి కేసీఆర్ నెట్టారు. కాళేశ్వరం కట్టి తెలంగాణ ప్రజల మీద భారం మోపారు. మొసలీ కన్నీరు కార్చిన కేసీఆర్ ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదు' అని మహేశ్వర్ రెడ్డి ధ్వజమెత్తారు.

# గుట్టలు లూటీ.. రెచ్చిపోతున్న




### మార్చాల గ్రామంలో అడ్డగోలుగా మట్టి దందా

**నిబంధనలకు విరుద్ధంగా హరితహారం చెట్లు తొలగింపు**

**ఉపాధి హామీ సొమ్ము లక్షలలో వృధా**

**మాకు సంబంధం లేదంటున్న గ్రామ కార్యదర్శి,**

**ఫోన్ చేసినా స్పందించని ఎ డి,అధికారులు**

కల్వకుర్తి ఏప్రిల్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:–రాత్రి,పగలు అనే తేడా లేకుండా మార్చాల పల్లగుట్టలో వాహనాల మోత కల్వకుర్తి మండలం మార్చాల గ్రామంలో ఎర్రమట్టి నాయకుల అండదండలతో కాంట్రాక్టర్లు రెచ్చిపోతున్నారు.రాత్రి, పగలు ఎర్ర మట్టిని అక్రమంగా తీస్తూ తిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. మార్చాల గ్రామంలో పలగుట్ట సర్వే నెంబర్ 316లో దాదాపు 65 ఎకరాల విస్తీర్ణంలో పలగుట్ట (ఎర్రటిమట్టి)తో ఉంది. దీనిపై కొంతమంది దృష్టిపడి ఎలాంటి అనుమతులు లేకుండా జెసిబి ల సహాయంతో అక్రమ మట్టిని తవ్వుతూ టిప్పర్లతో తరలిస్తున్నారు. అదే గుట్ట పై హరితహారం మొక్కలను నిబంధనలకు విరుద్ధంగా తొలగించి,ఇష్టారాజంగా మట్టిని తరలిస్తున్నారు. అక్రమంగా మట్టిని తరలిస్తూ, సొమ్ము చేసుకుని సహజ సంపదకు కొంతమంది వ్యక్తులు నష్టం చేస్తున్నారని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం పై రెవిన్యూ అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఎలాంటి స్పందన రాలేదన్నారు. ఆ గ్రామానికి చెందిన పలువురు నాయకులు, అక్రమ మట్టి తవ్వకం దారులతో చేతులు కలిపి అక్రమ దందకు తెర లేపారని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, మట్టి వ్యాపారానికి వినియోగిస్తున్న వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.



## వడ్ల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే

కల్వకుర్తి ఏప్రిల్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:– కల్వకుర్తి నియోజకవర్గం ఆమనగల్ మండలంలోని మల్లెపల్లిలో జై భీమ్ జై బాపు సంవిధాన్ కార్యక్రమంలో గ్రామస్తులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం వెల్దండ మండల కేంద్రంలో కల్యాణ లక్ష్మి షాది ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంతేకాకుండా జెపి నగర్ లో కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యాడ్ వద్ద వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడుతూ అన్ని విధాలుగా రైతులకు ఉపయోగపడే విధంగా మేము బాధ్యత తీసుకుంటామంటూ ఎంతమంది ఎన్ని తీసుకువచ్చినా ఎన్ని లారీలు వచ్చిన మేము ఏ ఒక్క రైతుకు ఇబ్బంది పెట్టము అంటూ ఆయన వాక్యాన్ని ఇచ్చారు. రాష్ట్ర పొల్యూషన్ మెంబర్ ఠాగూర్ బాలాజీసింగ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్, కల్వకుర్తి టౌన్ ప్రెసిడెంట్ చిమ్ముల శ్రీకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి పార్టీ

### ::: తమలపాకుల హర్షలత



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి...ఏప్రిల్ : 28 ... రాజ్యాం గాన్ని అపహాస్యం చేస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తుందని రంగారెడ్డి జిల్లా జర్నల్ సెక్రెటరీ. తమలపాకుల హర్షలత ఆరోపించారు ఈ సందర్భంగా మా ట్లాడుతూ జై బాపు జై భీమ్ జై సాంవిధాన్ కార్యక్రమం గొప్ప కార్య క్రమం అన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేకత విధా నాలపై కేంద్ర ప్రభుత్వం. రాజ్యాంగ విలువలను కాలరాస్తుందని విమ ర్శించారు రాజ్యాంగ విలువలు ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత కాం గ్రెస్ పార్టీ తీసుకుంటుందని అన్నారు రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్ర చేపట్టి దేశమంతా ఐక్యత చేసిందన్నారుఈఈ కార్యక్రమం లొ నాయకులు తదితరులు పాల్గొన్నారు




## కరాటే పంచులతో హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్

కాప్రా,వార్తా మిర్రర్,ఏప్రిల్2:ఆదివారం హైదరాబాద్ సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన ఇండో – నేపాల్ ఇంటర్నేషనల్ ఆల్ స్టైల్స్ హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో కుషాయిగూడ,చర్లపల్లికి చెందిన ఛాంపియన్స్ షోటోకన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు.ఈ పోటీలు నిర్వహించిన హై రెంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ వారు అత్యధిక ఎయిర్ పంచెస్ (45,808) కొట్టి హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు సాధించారని ఛాంపియన్స్ షోటోకన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఫౌండర్, డైరెక్టర్ కరాటే కోచ్ బుడిగే రవి కుమార్ గౌడ్ తెలిపారు. కరాటే పంచులతో హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ చోటు సంపాదించుకున్న కరాటే విద్యార్థులకు సర్టిఫికెట్లు,పతకాలు, ట్రోఫీలను విద్యార్థులకు అందజేశారు.

## చరిత్రలో నిలిచిపోయేలా బిఆర్ఎస్ రజతోత్సవ సభ!

### పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం - డాక్టర్ ర్యాకల శ్రీనివాస్



యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి.. ప్రత్యేక తెలంగాణ సాధనే ధ్యేయంగా 14 ఏళ్ల సుదీర్ఘ పోరాటం చేసి ఎన్ని అడ్డంకులు,మరెన్ని అవహేళనలు ఎదురైనా ఉద్యమమే ఊపిరిగా, రాష్ట్రాన్ని సాధించుకోవాలన్న ఆశనే శ్వాసగా పోరాడి చివరకు అనుకున్న లక్ష్యాన్ని ముద్దడింది తెలంగాణ రాష్ట్ర సమితి. ప్రత్యేక రాష్ట్ర సాధనే ప్రధాన లక్ష్యంగా 2001 ఏప్రిల్ 27న కేసీఆర్ (కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు) తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని స్థాపించారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన టీఆర్ఎస్.. రాష్ట్రం సిద్ధించిన తర్వాత ఒక్కసారి కాదు రెండుసార్లు అధికారంలోకి వచ్చింది. కాగా 2022లో టీఆర్ఎస్‌ను పార్టీ అధినేత కేసీఆర్ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)గా మార్చారు. ప్రస్తుతం ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న నేపథ్యంలో.. రజతోత్సవ సభను అత్యంత వైభవంగా నిర్వహించి చరిత్ర సృష్టించడం జరిగిందన్నారు.

## వివి లక్ష్మీనారాయణను మర్యదపూర్వకంగా కలసిన కర్నాటి మనోహర్



వార్త మిర్రర్ రంగారెడ్డి జిల్లా ప్రతినిధి...ఏప్రిల్ : 28 ...మాజీ సిబిఐ డైరెక్టర్, జెడి ఫౌండేషన్ అధ్యక్షులు వివి లక్ష్మీనారాయణ ను మర్యదపూర్వకంగా కలసిన తెలంగాణ పద్మశాలి సంఘం ఉపాధ్యక్షులు మరియు ఫ్యూచర్ సిటీ గౌరవ అధ్యక్షులు కర్నాటి మనోహర్ శాలువాతో ఘనంగా సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సేవకుడు, ప్రజా నాయకుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అట్టడుగు వర్గాల ఆశా కిరణం , ఎవరికి ఏ ఆపద వచ్చినా క్షణాల్లో వాలిపోయే వివి లక్ష్మీనారాయణ నాకు అత్యంత ప్రాణ స్నేహితుడు. నేను అభిమానించే నాయకుడు, మాజీ ఐపీఎస్ అధికారిని కలవడం చాలా సంతోషం. అదృష్టంగా భావిస్తున్నాను అని అన్నారు



## బదిలీ అయిన అదనపు జూనియర్ సివిల్ జడ్జి సన్మానించిన న్యాయవాదులు

మిర్యాలగూడ ఏప్రిల్ 28:– (వార్త మిర్రర్) మిర్యాలగూడ మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్ఎన్.సుమబాల బదిలీపై ఖమ్మం జిల్లా జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు బదిలీ అయ్యారు. సత్తుపల్లి వెళ్తున్న సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు. నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, కార్యవర్గం, న్యాయవాదులు జడ్జిని సోమవారం ఘనంగా సన్మానించారు, ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఐదవ అదనపు జిల్లా జడ్జి జి.వేణు, సీనియర్ సివిల్ జడ్జి సుజయ్ కుమార్, ఇతర సీనియర్ న్యాయవాదులు, జూనియర్ న్యాయవాదులు సిహెచ్ రఘురామారావు, కే శ్రీనివాస్ రెడ్డి, గౌరు వెంకటేశ్వర్లు, ఎజిపి గోదాల వెంకటరెడ్డి, న్యాయవాది రాయారపు భాస్కర్ పాల్గొన్నారు



## వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో శేఖర్ రెడ్డి,,,

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 28 : చౌటుప్పల్ మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆర్డీవో శేఖర్ రెడ్డి సందర్శించడం జరిగింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల నుండి ధాన్యం కొనుగోలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి ఆర్డీవో శేఖర్ రెడ్డికి ధాన్యం కొనుగోలుపై పలు సమస్యలు చెప్పడం జరిగింది. ఒక రైతు మిల్లుకు 7 లేక 8 సెంటర్లు ఉండటం వలన లారీ దిగుమతి సమయం రెండు రోజులు పడుతుంది. పోచంపల్లి మండలం లోని రైస్ మిల్లు కేటాయించినచో కొన్ని లారీలు అక్కడికి పోవడం జరుగుతుంది. లారీలు తొందరగా దిగుమతి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పెద్ద కొండూరు కేంద్రాలకు 3 లారీలు, చిన్న కొండూరు కేంద్రాలకు 2 లారీలు, మార్కెట్ యార్డులో సీసీ ఉండడం వలన చిన్న వర్షానికై ధాన్యం తడిసి పోతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం కార్యదర్శి ఎరుకల రమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు..

## వీధికుక్కలను నిలువరించాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం

మిర్యాలగూడ, ఏప్రిల్ 28:– (వార్తమిర్రర్) : కుక్కల బెడదను నివారించాలని మిర్యాలగూడ పట్టణంలోని సీతారాంపురం వాసులు సోమవారం మున్సిపల్ కమిషనర్ ఎండి.యూసుఫ్ కు వినతిపత్రంలో ఫిర్యాదు జేశారు. పట్టణంలోని 28, 43 వార్డుల పరిధిలోని సీతారాంపురంలో వీధి కుక్కలు విపరీతంగా పెరిగిపోయాయని, నిత్యం జనాలు తిరుగుతున్న సమయంలో కుక్కలు సంచరిస్తూ జనాలపై దాడులకు పాల్పడుతున్నాయని వాడల వాసులు ఆరోపించారు. ముఖ్యంగా రాత్రి వేళలో ఆయా ప్రధాన కూడలలో కుక్కలు ఉండడం వల్ల అటుగా వచ్చి వెళ్లే మహిళలు, చిన్నారులు, వృద్ధులపై ఎగబడి కాటు వేసి గాయపర్చుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం స్కూళ్లకు సెలవులు ఉండటం వల్ల చిన్న పిల్లలు వాడలో ఆడుకునే సమయంలో కుక్కలు దాడులు చేసి పిల్లలను గాయపరుస్తున్నాయని పేర్కొన్నారు. వీధి కుక్కలప వలన ఆయా ప్రాంతాల ప్రజలు బయటికి వచ్చేందుకు భయపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వలన రేబిఎస్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నదని చెప్పారు. కుక్కలు రోజు రోజుకు పెరిగిపోతున్నాయని వెంటనే నిర్మూలించాలని ఫిర్యాదులో కోరారు. కార్యక్రమంలో ఆయా ప్రాంతవాసులు, నాయకులు మాక్దుం పాషా, ఖాదర్, ఆయూబ్, మర్కజ్ పాషా, షకీల్, షఫీ, యూనిస్, మొయిజ్, సాదిక్, నయీమ్, అలీ పాల్గొన్నారు.





## ఉగ్రవాదుల దాడికి పై నిరసన వ్యక్తం చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులు.

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి ఏప్రిల్ 28 : చౌటుప్పల్ మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జమ్ము కాశ్మీర్ లో జరిగిన ఉగ్రవాదుల దాడికి నిరసన కార్యక్రమం చేయడం జరిగింది. చనిపోయిన పర్యాటకుల కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించి అలాగే చనిపోయిన వారికి కొవ్వొత్తులు వెలిగించి వారి ఆత్మ శాంతి చేకూరాలని భగవంతుని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య,మాజీ మున్సిపాలిటీ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, పబ్బు రాజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు బోయ దేవేందర్, మున్సిపాలిటీ అధ్యక్షులు సుర్వి నరసింహ గౌడ్, మొగుదాల రమేష్ గౌడ్, అర్ధ వెంకటరెడ్డి, తాజా మాజీ కౌన్సిలర్లు,తదితరులు పాల్గొన్నారు



## ఉచిత వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి ఏప్రిల్ 28 : జగిత్యాల జిల్లా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మరియు డిస్టిక్ యూత్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో రాయికల్ మండలం భూపతిపూర్ గ్రామంలో మే 1 నుండి 31మే వరకు భూపతిపూర్ ఉన్నత పాఠశాల మైదానం నందు వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం ఉచితంగా నిర్వహించబడును. కావున ప్రభుత్వ పాఠశాల పిల్లలు మరియు ప్రైవేటు పాఠశాల పిల్లలు, యువకులు ఈ కోచింగ్ క్యాంప్ లో పాల్గొనవచ్చు. నోటు : ఉదయం 6 గంటల నుండి 8 గంటల వరకు సాయంత్రం 5 గంటల నుండి 7గంటల వరకు నిర్వహించబడును అని కోచ్ వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రతాపరెడ్డి తెలిపారు. 9440922296 ఈ నంబర్ కు సంప్రదించవల్సింది గా కోరారు.

### మనిషి తెలివిమీరిన చేష్టలు చేస్తూ. పకృతి మాతకు విఘాతం కలిగిస్తూ...

### రకరకాల ఉడుపులతో వేషధారణ చేస్తూ...



మతిమాలిన మితిమీరిన తెలివితేటలతో సంస్కృతి సంప్రదాయాలను నాశనం చేస్తూ.కాయంలో ప్రాణం పోయాక ఒక్క క్షణం కూడా ఇంట్లో ఉంచుకోని బంధాలు కోసం అబద్ధాలు, మోసాలు చేస్తూ. కళేబరాలతో కల్తీ నూనెలు తయారు చేస్తూ. రాజ్యం ఏలుతున్న దుష్ట నికృష్ట రక్కసులను నామరూపాలు లేకుండా చేసే అణ్వాయుధమైపో అక్షరమా..! గుంట నక్కల మాయతెరల వెనుక కృంగుతున్న...కనులుండీ కబోదులుగా మారుతున్న ప్రతి మనిషి లోని అజ్ఞాన తిమిరాలను సంహరణ చేసి వారి జీవితాల్లో చిరుదీపమై వెలిగేట్లు చేయి అక్షరమా..!

**శీర్షిక: అక్షరమా..!**

**మంజుల పత్తిపాటి (కవయిత్రి). మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్.**





# గొర్రెల దొంగలను కఠినంగా శిక్షించాలి

## తుర్కయాంజాల్ మున్సిపాలిటీ బహుజన్ సమాజ్ పార్టీ అధ్యక్షులు -పట్నం రమేష్ కురుమ

వార్త మిర్రర్,తుర్కయంజాల్ : తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని కోహెడ గ్రామంలో తెల్లవారు జామున 3 గంటలకు రాసూరి శ్రీశైలం కురుమ గొర్రెల మంద వద్ద వారి కుమారుడు రాసూరి నవీన్,అల్లుడు రావుల శ్రీకాంత్ లు మంద వద్ద కాపలాగా నిద్రిస్తుండగా గుర్తు తెలియని దుండగులు బొలెరో వాహనం లో 10 మంది వచ్చి కత్తులతో దాడిచేసి సుమారుగా 60 నుండి 70 గొర్రెలను ఎత్తుకెళ్లారు.ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్ రాసూరి నవీన్ ప్రైవేట్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నాడు,ఇదే గ్రామంలో వారం రోజుల క్రితం కోశిక నరసింహ 30 గొర్రెలను ఎత్తుకెళ్లడం గమనార్హం ఇలా వరుస సంఘటనలు జరుగుతున్న పోలీస్ ల నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుంది. ఇప్పటికైనా దోషులను తొందరగా పట్టుకొని శిక్షించి పోలీస్ వ్యవస్థ పైన సామాన్యులకు విశ్వాసం కలిగించే విధంగా రక్షణ కలిగించాలని, అలాగే బాధితులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ పక్షాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు లపంగి రాజు, కోహెడ సెక్టార్ అధ్యక్షులు శీలం అంగదు కుమార్, 2 వార్డు అధ్యక్షులు ఏర్పుల రవి కుమార్, సీనియర్ నాయకులు డా. యడవల్లి శ్యామ్,ఆలె మల్లేష్, సుబ్బురి రాఘవేందర్,నెలకంటి ఆనంద్,తదితరులు పాల్గొన్నారు.

# రాయికల్‌లో పాలీసెట్ మాక్ టెస్ట్ ఆన్‌లైన్ నమోదుపత్రం విడుదల

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిది ఏప్రిల్ 28 : శ్రీ వైవిధ్య పాలిటెక్నిక్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న పాలీసెట్ మాక్ టెస్ట్ కోసం ఆన్‌లైన్ నమోదు పత్రాన్ని రాయికల్ తహసిల్దార్ మహమ్మద్ ఖయ్యూమ్ మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఖయ్యూమ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు సాంకేతిక విద్యలో ఉత్తమ అవకాశాలను అందించడంలో ఇటువంటి కోచింగ్ సెంటర్ల పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను స్థిరపర్చుకొని కృషి చేస్తే తప్పకుండా మంచి ఫలితాలను సాధించగలరని పేర్కొన్నారు. పాలీసెట్ పరీక్ష రాయబోయే విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను ఉపయోగించుకొని అత్యుత్తమ ర్యాంకులు సాధించాలని కోరారు. విద్యార్థులందరికీ విజయాకాంక్షలు తెలిపారు. అనంతరం తహసిల్దార్ ఖయ్యూమ్ ని శ్రీ వైవిధ్య పాలీసెట్ ఇన్‌స్టిట్యూట్ తరఫున విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాలీసెట్ మాక్ టెస్ట్ తేది 05-05-2025 న ఉదయం 10:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ప్రణతి జూనియర్ కళాశాల, రాయికల్ ప్రాంగణంలో నిర్వహించనున్నారు. విద్యార్థులు తమ నమోదు ప్రక్రియను 04-05-2025 లోపు పూర్తి చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ కొరకు సంప్రదించవలసిన నెంబర్ 8121499243. ఈ కార్యక్రమంలో ప్రణతి జూనియర్




కళాశాల ప్రిన్సిపల్ శ్రీ బందెల తిరుపతి, నిర్వాహకులు ఆకు రాజేందర్, డా. బొద్దుల రాజేందర్, మామిడాల మహేష్, బొద్దుల రమ్యకృష్ణ పాల్గొన్నారు.

# రజతోత్సవ సభను విజయవంతం చేసిన భువనగిరి మండల బిఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు

### బిఆర్ఎస్ భువనగిరి మండల శాఖ అధ్యక్షులు జనగాం పాండు

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి : యాదాద్రి భువనగిరి జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో మీడియా సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు జనగాం పాండు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిన్న వరంగల్ ఎల్కతుర్తిలో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ పార్టీ అధ్యక్షుడు కెసిఆర్ అధ్యక్షతన బ్రహ్మాండంగా జరిగిందన్నారు. రజతోత్సవ సభకు యాదాద్రి జిల్లా భువనగిరి మండలం నుండి దాదాపు 5 వేల మంది సభకు హాజరైనట్టు వారు తెలిపారు. సభను విజయవంతం చెయ్యడం కోసం నెల రోజుల నుండి కార్యాచరణ మొదలుపెట్టి శ్రమించిన పార్టీ నాయకులకు, మాజీ ఎంపీపీలు, మాజీ జటీపీటీసీలు, గ్రామశాఖ అధ్యక్షులకు మరియు కార్యకర్తలకు వారు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలిపారు. నిన్న జరిగిన రజతోత్సవ సభలో మాజీ సీఎం కెసిఆర్ ఇచ్చిన్న సందేశంతో పార్టీ క్యాడర్ లో ఉత్సాహం నిండిందని, రాబోయే స్థానిక ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలంతా కష్టపడి తమ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ జటీపీటీసీ సుబ్బారు బీరు మల్లయ్య, మాజీ ఎంపీపీ అతికం లక్ష్మి నారాయణ, భువనగిరి బిఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి నీల ఓం ప్రకాష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్బగాని వెంకట్ గౌడ్, బిఆర్ఎస్ జిల్లా నాయకులు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, బిఆర్ఎస్ మండల యువజన




విభాగం అధ్యక్షులు ములే నాగేందర్ బాబు, బిఆర్ఎస్ నాయకులు శెట్టి శ్రీకాంత్ యాదవ్, సిలివేరు మధు తదితరులు పాల్గొన్నారు

# లండన్‌లో తప్పిపోయిన నిజామాబాద్ జిల్లా విద్యార్థి: స్పందించిన సీఎంఓ



లండన్ లో తప్పిపోయిన తన కుమారుడు నల్ల అనురాగ్ రెడ్డి జాడ వెతికి తెలుసుకుని ఇండియాకు వాపస్ తెప్పించాలని విద్యార్థి తల్లి హరిత ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి, ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ఈరవత్రికి సోమవారం వినతిపత్రం పంపారు. నిజామాబాద్ జిల్లా ముప్కాల్ మండలం రెంజర్ల గ్రామానికి చెందిన అనురాగ్ విద్యార్థి వీసాపై జనవరిలో లండన్ కు వెళ్ళాడు. యూకే లోని కార్డిఫ్ ప్రాంతంలో ఈనెల 25న సాయంత్రం నుంచి తన కుమారుడు జాడ తెలియకుండా పోయాడని హరిత తన వినతిపత్రం లో తెలిపారు. వెంటనే స్పందించిన ఖనిజాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ అనిల్ ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ), జిఏడి ఎన్నారై అధికారులతో మాట్లాడారు. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఢిల్లీలోని విదేశాంగ శాఖకు, లండన్ లోని ఇండియన్ హై కమీషన్ కు లేఖలు రాశారు.



# పద్మశాలి కుల సంఘం అధ్యక్షునికి ఘన సన్మానం

### బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్

సంస్థాన్ నారాయణపురం,ఏప్రిల్ 28,( వార్త మిర్రర్ ):సంస్థాన్ నారాయణపురం మండలంలోని పుట్టపాక గ్రామంలో బీసీ సంక్షేమ సం ఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్,ఆధ్వర్యంలో పద్మశాలి కుల సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన గజం సత్యనారాయణ కి హార్దిక శుభాకాంక్షలు తెలియజేసి శాలువాతో సత్కరించారు బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు బొల్లెపల్లి లక్ష్మణ్ గౌడ్.కార్యక్రమంలో గంజి వెంకటేశం,కుకుడాల నరసింహ,శీను,ఏలె దామోదర్,దోర్నాల నర్సింగ్,గంజి కిషోర్,గజం శ్రీకాంత్,పూల మహేష్,అవ్వారి అనిల్, పానుగంటి క్రాంతి,సాంబయ్య,తదితరులు,పాల్గొన్నారు.



# జిమ్‌లో వర్కవుట్‌లు చేస్తూ.. గాయపడ్డ కేటీఆర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు గాయపడ్డారు. జిమ్ వర్కవుట్ చేస్తుండగా గాయమైనట్లు ఆయన తన ఎక్స్ ఖాతా ద్వారా తెలియజేశారు. వైద్యులు కొన్నిరోజులు బెడ్ రెస్ట్ తీసుకోవాలని సూచించారని, త్వరలోనే కోలుకుంటానని ఆశిస్తున్నట్లు KTR ఓ పోస్ట్ ఉంచారు.ఇదిలా ఉంటే.. ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కేటీఆర్ పాల్గొన్న సంగతి తెలిసిందే. కేటీఆర్‌కు తెలంగాణ హైకోర్టు లో ఊరట లభించింది. రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కేటీఆర్‌పై బంజారాహిల్స్ పీఎస్‌లో కేసు నమోదు అయ్యింది. “రేవంత్ రెడ్డి ఢిల్లీకి రూ.2,500కోట్లను పంపించారని కేటీఆర్ ఆరోపించగా, కాంగ్రెస్ నేత శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. అయితే.. ఈ కేసును కొట్టేయాలని కేటీఆర్ పిటిషన్ వేశారు. ఇరువైపులా వాదనలు విన్నజస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం కేసును కొట్టేస్తున్నట్లు సోమవారం తీర్పు ఇచ్చింది.



# రైతు పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుంది

### ::: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

వార్త మిర్రర్,తుర్కయాంజల్ : రైతులు పండించిన ప్రతి వరి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి అన్నారు.తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూర్ గ్రామంలో జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం ఆధ్వర్యంలో వరి దాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు క్వింటాల్ కు 500 బోనస్ను అందజేస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో టెస్కాబ్ వైస్ చైర్మన్,డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య,గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి,వైస్ చైర్మన్ సీహెచ్ భాస్కర్ చారి,మండల మాజీ వైస్ ఎంపీపీ మల్ రెడ్డి యాదిరెడ్డి, %ూాజూ% చైర్మన్ చామ కృష్ణారెడ్డి, మాజీ కౌన్సిలర్ నక్క శివలింగం గౌడ్, కొంతం వెంకట్ రెడ్డి,తుర్కయంజాల్ సహకార సంఘం సభ్యులు కృష్ణా రెడ్డి,చాపల యాదగిరి,మార్కెట్ కమిటీ డైరెక్టర్లు,డీసీఎంస్ అధికారులు, నాయకులు ముత్యాల రాజశేఖర్, సంరెడ్డి బలవంత్ రెడ్డి,అనీల్ రెడ్డి,వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




# హిందూ జాగృతి లింగంపల్లి ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు ఘన నివాళి..

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ : కాశ్మీర్ పహాల్గాం లోని ఉగ్రవాదుల దాడిలో అమరులైన పర్యాటకులకు శ్రద్ధాంజలి ఘటిస్తూ.. హిందూ జాగృతి లింగంపల్లి ఆధ్వర్యంలో పహల్గాం మృతులకు ఘన నివాళులు అర్పించారు. గోపినగర్ హనుమాన్ దేవాలయం నుండి.. చందానగర్ శ్రీదేవి థియేటర్ వద్ద నుండి.. పీజేఆర్ స్టేడియం నుండి వేరువేరుగా ప్రారంభమైన మూడు శాంతి ర్యాలీలు బిహెచ్ఇఎల్ చౌరస్తా వరకు చేరుకున్నాయి. పెద్ద సంఖ్యలో పాల్గొన్న హిందువులు అక్కడ కొవ్వొత్తులు వెలిగించి 2 నిమిషాలు మౌనం పాటించి పహల్గాం మృతులకు నివాళులు అర్పించారు. ఈ ర్యాలీలో సంఘ్ పరివార్ కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు, పతంజలి యోగ సమితి సభ్యులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని ఉగ్రవాదుల దుశ్చర్యపై మండిపడ్డారు. పాకిస్తాన్ ద్వంద్వ నీతి పై ధ్వజమెత్తారు. హిందువా కాదా అని తెల్చుకొని మరి కాల్చి చంపడం అమానుషమని అన్నారు. హిందూ దేశంలో హిందువులకే రక్షణ కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. మొన్న పశ్చిమ బెంగాల్లో హిందువులను తమ స్వస్థలాల నుండి తరిమి కొట్టారని.. ఈరోజు కాశ్మీర్ లోని పహాల్గంలో ఏకంగా పేర్లు అడిగి, కల్మా చదివించి, దుస్తులు విప్పదీసి మరి హిందువులపై దాడి చేయడాన్ని ప్రపంచం మొత్తం చూసిందని వాపోయారు. సమాజంలోని ప్రతి వర్గం వారు ఈ దుశ్చర్యను ఖండించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. పాకిస్తాన్ కు తగిన గుణపాఠం నేర్పించాలని మళ్లీ భారత్ వైపు కన్నెత్తి చూడకుండా వెన్నులో వణుకు పుట్టించాలని ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేశారు.



# బిఆరెస్ మహా సభ సక్సెస్ పట్ల హర్షం వ్యక్తం చేసిన మారబోయిన రవి యాదవ్. గచ్చిబౌలి మాజీ కార్పొటర్ కోమిరిశెట్టి సాయిబాబాలు

శేరిలింగంపల్లి వార్త మిర్రర్ :- శేరిలింగంపల్లి నియోజకవర్గం మసీద్ బండ లోని యువ నాయకుడు గ్రేటర్ హైదరాబాద్ యూత్ మాజీ ఉపాధ్యక్షులు మారబోయిన రవి యాదవ్, గచ్చిబౌలి డివిజన్ మాజీ కార్పొరేటర్ కొమ్మిరి శెట్టి దాయిబాబల పిలుపు మెరుకు వరంగల్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రాజతోత్సవ సభను విజయవంతం కావడానికి సహకరించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలకు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు, సోషల్ మీడియా వారియర్స్ కు, మీడియా మిత్రులకు చిన్న, పెద్ద అని తేడా లేకుండా బాపు కోసం పార్టీ కోసం వచ్చిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అయన తేలిపాడు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో ఇంతే చురుకుగా పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పిలుపు మెరుకు వరంగల్ లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ రాజతోత్సవ సభను విజయవంతం కావడానికి సహకరించిన శేరిలింగంపల్లి నియోజకవర్గం లోని ప్రతి ఒక్క బిఆర్ఎస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, యువ నాయకులు, మహిళా కార్యకర్తలకు, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు, సోషల్ మీడియా వారియర్స్ కు, మీడియా మిత్రులకు చిన్న, పెద్ద అని తేడా లేకుండా బాపు కోసం పార్టీ కోసం వచ్చిన ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు అయన తేలిపాడు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో ఇంతే చురుకుగా పాల్గొంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.